క్లుప్తంగా

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన


పూజలందుకున్న అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంతో ప్రత్యేకంగా అభిషేకాలు చేసి 108 వెండి పుష్పాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం కార్యక్రమం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో కాముడి దహనం


గుడిపాటిగడ్డలో కామదహనం చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో కామదహనం వేడుకలను సోమవారం అర్ధరాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని గుడిపాటిగడ్డ, మూలసాగరం, నూనెపల్లె ప్రాంతాల్లో కర్ర దుంగలను పేర్చి తప్పెట్లతో కాముడి చిత్రపటాన్ని అందులో ఉంచి దహనం చేసి కేరింతలు వేస్తూ రంగులు చల్లుకున్నారు.

లోక కల్యాణార్థం హోమాలు


హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పాల్గున మాస పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని స్పటిక లింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం లోక కల్యాణార్థం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. తెల్లవారు జామున స్పటిక లింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాల పిదప హోమాలు జరిపించి పూర్ణాహుతి గావించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలోయోగానంద, గాంధీ, సుబ్బయ్య, జగదీష్, తిమ్మయ్య, రఘునాథ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): రాష్ట్రస్థాయి అంతర వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన నంద్యాల వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని నైరా వ్యవసాయ కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్విజ్‌లో హరీష్‌కుమార్, కుమారి శ్రీరేఖ ప్రథమ స్థానంలో సత్తా చాటారు. అలాగే వ్యాసరచన పోటీల్లో శ్రీరేఖ ద్వితీయ స్థానంలో నిలిచింది. విద్యార్థులను ఏవీఆర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ, ఓఎస్‌ఏ నరసింహులు, ఓఏఎం పుల్లిభాయ్, వార్డెన్ చైతన్య అభినందించారు.

ఆటల పోటీలు ప్రారంభం


టగ్ ఆఫ్ వార్‌లో పోటీల్లో పాల్గొన్న ఉద్యోగినులు

నంద్యాల: మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఉద్యోగినుల ఆటల పోటీలను జాయింట్ కలెక్టర్ నిశాంతి మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగినులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఐసీడీఎస్ పీడీ లీలావతి, కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ నాగమణి పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

నంద్యాల(సిటీ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు ఎంఎస్‌వీ రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి 25వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన వారికి 25న బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9885240365 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇంతులు..కాంతులు

అసలే గ్రామీణ నేపథ్యం..చొరవ తక్కువ.. లోకజ్ఞానంపై అవగాహన లేదు.. వ్యవసాయాధారిత కుటుంబాలకు చెందిన వారు.. ఎంత పోరాడినా వ్యవసాయం గిట్టుబాటు కాకపోయినా వారి ప్రయత్నం మాత్రం అపలేదు. పిల్లల భవిష్యత్ కోసం..కుటుంబాన్ని వృద్ధిలోకి తీసుకురావడానికి తమ వంతు చేయూనిస్తూ.. రాత్రనకా, పగలనకా.. శ్రమించి కుటుంబాలకు దీపాలై వెలుగులిస్తున్నారు శాంతినగరం మహిళలు. వివిధ రంగాల్లో తమదైన శైలిలో రాణిస్తూ, ఆదర్శంగా నిలవడమే కాకుండా తమ పిల్లలు వివిధ రంగాల్లో స్థిరపడేలా శ్రమించారు. వారి విజయం ఆ కుటుంబాల భవిష్యత్‌కు దిక్సూచిలా మారింది.

- అన్ని రంగాల్లో రాణిస్తున్న వనితలు
- స్వయం ఉపాధితో కుటుంబానికి అండగా నిలుస్తున్న గ్రామీణ మహిళలు
- మరి కొందరికి ఉపాధి కల్పిస్తున్న వైనం


శాంతినగరంలో పిండి వంటలు తయారు చేస్తున్న మహిళలు

ఆళ్లగడ్డ: శాంతినగరం.. ఆళ్లగడ్డ, నంద్యాల జాతీయర రహదారిపై బత్తలూరు గ్రామ పంచాయతీలో ఓ చిన్న మజరా గ్రామం. అయినా ఈ ఊరిలో ప్రతి ఇంట్లో ఒక ఉద్యోగి ఉన్నారు. ఒక్కో ఇంట్లో ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు కూడా ఉన్నారు. సీఏ, ఇంజినీరింగ్, ఎంటెక్ వంటి ఉన్నత చదువులు చదివి.. అనేక మంది దేశ విదేశాల్లో స్థిరపడిపోయారు కూడా. వీరంతా ఉన్నత శిఖరాలకు చేరుకోవాడానికి కారణం మహిళా శక్తి. తమ బిడ్డలు ఉన్నత చదువులు చదవాలని. ఆర్థికంగా అభివృద్ధి చేందాలనే పట్టుదలే వారిని ముందుకు నడిపించింది. గ్రామంలోని మహిళలలు అందరు ఒక్కటై శ్రీ సీత గ్రామైక్య సంఘం ఏర్పాటుకు దారితీసింది.

స్వయం శక్తితో రాణిస్తూ..

ఒక్కొక్కరుగా ఏమీ సాధించలేము. అందరం కలవాలి.. ఆలోచనలు పంచుకోవాలి.. సాధ్యాసాధ్యాలను బేరీజు వేసుకోవాలి.. ఇందుకు ప్రణాళిక కూడా ముఖ్యమే.. శాంతి నగరం మహిళలు ఈ అంశాలన్నిటినీ పరిగణలోకి తీసుకున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ముందుగా ఆసక్తి ఉన్న 30 మంది మహిళలలు ఏకమయ్యారు. తమకు తెలిసిన సంప్రదాయ పిండి వంటలు, చిరుతిళ్ల పదార్థాలను తయారు చేసి మార్కెటింగ్ చేయాలనుకున్నారు. ఇందుకు వైఎస్సార్ క్రాంతి పథం అధికారుల సూచనలు సలహాలు కలిసివచ్చాయి. ముందుగా కొన్ని రకాల పిండి వంటలు, చిరుతిళ్ల పదార్థాలు తయారు చేసి పట్టణం, మండల కేంద్రాల్లో ప్రదర్శించి వాటి రుచి చూపించారు. రుచితో పాటు ధర అందుబాటులో ఉండటంతో అనతి కాలంలోనే శాంతినగరం పిండి వంటలు, పచ్చళ్లకు ఆదరణ పెరిగిపోయింది.

శ్రీ లక్ష్మి స్వగృహ ఫుడ్స్ ఫేమస్..

తాము చేసిన వంటలకు మంచి పేరు రావడంతో గిరాకీ పెరిగింది. అంతవరకు మార్కెంటింగ్ చేసుకునేందుకు తాము తయారు చేసిన పదార్థాలను తీసుకుని వీధుల్లో తిరిగిన వీరి దగ్గరికే వ్యాపారులు, అవసరమైన వ్యక్తులు నేరుగా వచ్చి ఆర్డర్లు ఇచ్చి కొనుగోలు చేసెందుకు క్యూ కడుతున్నారు. దీంతో వంట తయారీకీ గ్రామంలోనే ఓ ఇంటిని బాడుగకు తీసుకున్నారు. బొబ్బట్లు, తీపి గవ్వలు, కారం గవ్వలు, గారెలు(అత్తరాసలు), కర్జికాయలు, నువ్వుల ఉండలు, పప్పులు, నువ్వుల గట్టాలు, లడ్డు, కారాలు తదితర వాటిని తయారు చేసి 250 గ్రాముల ప్యాకెట్ నుంచి 1 కిలో వరకు ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు. అలాగే శుభకార్యాలకు క్యాటరింగ్ సైతం చేస్తున్నారు. వచ్చిన ఆదాయాన్ని సమభాగాలుగా పంచుకుంటారు. ప్రస్తుతం ప్రతినెలా ఒక్కొక్కరికీ రూ.15వేల చొప్పున ఆదాయం వస్తుందని వారు చెబుతున్నారు

గృహోపకరణాల తయారీలోనూ దిట్టలు..

వంటలు లేని సమయంలో ఖాళీగా ఉండకుండా డీఆర్డీఏ అధికారుల సూచన మేరకు ఇంటి అలంకరణ వస్తువులు, పూసల బ్యాగులు, పెన్ స్టాండ్లు, డోర్ కర్టన్లు, హ్యాండ్ బ్యాగులు, ఫుట్, డైనింగ్, టేబుల్ మ్యాట్లు తదితర అనే రకాలను జ్యూట్‌తో తయారు చేస్తుంటారు. మార్కెట్లో లభించే వివిధ రకాల రంగులు వీటికి అద్దుతున్నారు. ఆకర్షనీయంగా, ప్రకృతి సిద్ధమైనవి కావడంతో ఆదరణ పెరిగింది. వీటి ముడిసరుకు వీరు బెంగళూరు, హైదరాబద్ నుంచి తెచ్చుకుంటున్నారు.


జ్యూట్ బ్యాగులు తయారు చేస్తున్న దృశ్యం

ఆదరణ పెరుగుతోంది



ముందుగా ఇందులో విజయం సాధిస్తామా లేదా అని భయం ఉండేది. డీఆర్డీఏ అధికారులు, నియోజక వర్గంలోని తోటి ఐక్య సంఘం లీడర్ల ప్రోత్సాహంతో స్వగృహ ఫుడ్స్‌కు జిల్లాలో మంచి పేరు వచ్చింది. కరోనా కారణంగా తగ్గిన వ్యాపారం ఇప్పుడిప్పుడే మళ్లీ ఆదరణ పెరుగుతోంది. మా స్వగృహ ఫుడ్స్‌ను మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నాం

– విజయలక్ష్మి,ఐక్య సంఘం లీడర్, శాంతినగరం

మరింత మందికి ఉపాధి



ఎక్కువ లాభాపేక్ష లేకుండా కూలి వస్తే చాలు అనుకుని మొదలు పెట్టాం. మా దగ్గర పిండి వంటలు తీసుకునే వారు చాలా రుచిగా ఉన్నాయని అభినందిస్తుంటే ఎంతో సంతోషంగా ఉంటుంది. నాణ్యత పాటిస్తుండటంతో ఆదరణ రోజు రోజుకు పెరుగుతోంది. గ్రామంలోని అనేక మందికి ఉపాధి దొరకడంతో పాటు శాంతినగరం వంటలు అంటే జిల్లా వ్యాప్తంగా పేరు రావడం సంతోషంగా ఉంది. – వెంకటసుబ్బమ్మ,శాంతినగరం



మహిళా దినోత్సవం

ఆదర్శం..

చిన్నతనం నుంచే విద్యపై మక్కువ



డాక్టర్ శశికళ.. ఆదోని పట్టణంలో పుట్టి పెరిగిన ఆమె ఆదోనిలో స్కూలింగ్, ఇంటర్ పూర్తి చేశారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ సమాజానికి, విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. 2010లో స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డును నాటి ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య నుంచి అందుకున్నారు. అలాగే రాయలసీమ కథకులు, రేనాటి వీరులు–కోవెలకుంట్ల చరిత్ర లాంటి పలు గ్రంథాలను రచించి వాటిని ఐఎస్‌బీఎన్ (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నంబర్)తో ప్రచురించారు. జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో పలు ప్రచురణలు చేశారు. యూజీసీ నిర్వహించిన సెమినార్లలో 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్ ద లైట్ ఆఫ్ గ్లోబలైజేషన్' అనే అంశంపై జాతీయ స్థాయిలో సెమినార్ ఇచ్చి ప్రశంసలు పొందారు. అలాగే వ్యాట్‌పై జాతీయ స్థాయి సెమినార్, ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ పై పరిశోధనలు చేశారు.

– డాక్టర్ శశికళ, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, నంద్యాల

నాన్నే ఆదర్శం



మాది తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా. పదో తరగతి వరకు మహబూబ్‌నగర్‌లో, ఇంటర్, లా హైదరాబాద్‌లో పూర్తి చేశా. నాన్న ప్రభాకర్. సీనియర్ సివిల్ జడ్జి గద్వాల కోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని లా పూర్తియిన వెంటనే మొదటి ప్రయత్నంలోనే ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా గత సంవత్సరం ఆగస్టులో నంద్యాల కోర్టులో విధుల్లో చేరాను. అతి చిన్న వయస్సులోనే జడ్జిగా విధులు నిర్వహించడం గర్వంగా ఉంది.

–జి.అర్చన, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, నంద్యాల

నాన్న స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు..

నంద్యాల: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన బి.స్వాతికి చిన్నప్పటి నుంచి పేదలకు సేవ చేయాలనే తపనతో ఆత్మీయ సేవా స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది. సంస్థ ద్వారా వృద్ధులు, అనాథలు, దివ్యాంగులకు సాయం చేస్తూ దాతలతో విరాళాలు ఇప్పిస్తోంది. గృహిణిగా ఉంటూనే సమాజ సేవ చేస్తూ పేదల ఆకలి తీరుస్తోంది. అభాగ్యులు, అనాథలకు మిగులు ఆహారం, దాతల సహకారంతో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తూ మానవత్వాన్ని చాటుకుంటోంది. ఎవరైనా అన్నం మిగిలింది అనగానే అర్ధరాత్రి సైతం ఆహారాన్ని తీసుకొని బస్టాండ్, రైల్వే స్టేషన్ల ప్రాంతాల్లో ఉన్న వృద్ధులు, యాచకులకు పంపిణీ చేస్తుంది.

ఆరేళ్లుగా సేవా కార్యక్రమాలు..

'కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం మునగాల గ్రామ సర్పంచ్‌గా నాన్న పుల్లయ్య పేదల కోసం చేసిన సేవా కార్యక్రమాల స్ఫూర్తితోనే ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేశాం. 9మంది మహిళా సభ్యులతో ఏర్పాటైన సంస్థ పెళ్లిళ్లు, ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను తెచ్చి అన్నార్థులకు అందజేస్తాం. ఆరేళ్లుగా ఈ కార్యక్రమంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మతిస్థిమితం లేని వారికి స్నానాలు చేయించడం, ప్రమాదాలకు గురై కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉన్న కుటుంబాలను సహకారం అందిస్తున్నాం'.

సేవలకు గుర్తింపు..

సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు స్వాతిని అవార్డులతో సత్కరించాయి. ఇటీవల అంతర్జాతీయ మానవ హక్కుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో సమాజ సేవా పురస్కారం అందుకున్నారు. దీంతో పాటు సాయి యువసేన సర్వీసెస్ స్వాతిని మెమొంటోతో సత్కరించారు. పెద్ద శేషమ్మ అనాథాశ్రమ నిర్వాహకులు ప్రశంసా పత్రంతో సన్మానించారు.


యాచకురాలికి క్షవరం చేస్తున్న స్వాతి

ఓటు హక్కును వినియోగించుకోండి

ఉయ్యాలవాడ : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్సీ అభ్యర్థిని ఎన్నుకునేందుకు పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. నిరక్ష్యరాస్యులు, కంటి చూపు లేనివారు, ఆరోగ్యరీత్య ఇబ్బంది ఉన్న వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు మరొకరి సాయం కోసం 10వ తేదీలోపు కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో నేరుగా వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు డాక్టర్ సర్టిఫికెట్, సహాయకుని వయస్సు నిర్ధారణ, ఫొటో కలిగిన గుర్తింపు కార్డు వెంట తీసుకెళ్లాలని చెప్పారు. వారి సహాయంతో ఈ నెల 13వ తేదీన నంద్యాల పట్టణంలోని ఓటింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి సత్యన్న, ఏఈఓ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


ఎంపీటీసీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు

ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేయాలి

గోస్పాడు: స్థాని సంస్థల ప్రజా ప్రతినిధుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమంలో తమ ఓటు వేయాలని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఎలా అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటు వేసే పత్రంలో బాక్స్‌లోపలి భాగంలోనే ఓటు వేయాలని, సంతకాలు, వేలిముద్రలు వంటివి వేయరాదని సూచించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన పెన్నును మాత్రమే ఓటు వేసేందుకు వాడాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జగదీశ్వరమ్మ, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, ఉప మండలాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, రాజు, ఈఓఆర్‌డీ నాగేంద్రుడు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాలస్వామి, ఎంపీటీసీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై మంగళవారం ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి అవగాహన కల్పించారు. మండలంలో ఎంపీపీతో పాటు 13 మంది ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ కలిపి మొత్తం 15 మంది ఓటర్లు ఉన్నారు. ప్రాధాన్యత క్రమంలో ఓటు ఎలా వేయాలో వివరించారు.

కనుల పండువగా నారసింహుడి కల్యాణం


భూదేవి, నీలాదేవి సమేత శ్రీ యోగానంద లక్ష్మీనరసింహుడి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: జయజయ నారసింహా నామ సంకీర్తనలు ప్రతిధ్వనిస్తుండగా.. విద్యుద్దీపకాంతుల వెలుగులో.. పండితుల వేదమంత్రోచ్చారణలు.. విద్వాంసుల మంగళ వాయిద్యాల నడుమ శ్రీ యోగానంద లక్ష్మీనరసింహుడు భూనీల మహాలక్ష్మి పరిణయ వేడుక కనుల పండువగా జరిగింది. రామతీర్థ పుట్టాలమ్మ పరుశురామలింగేశ్వరస్వామి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం మూలమూర్తులను సుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులు భూనీలా సమేత శ్రీ యోగనంద లక్ష్మీనరసింహస్వాములను యాగశాలలో కొలువుంచి అర్చన, అభిషేకం, తిరుమంజనం చేపట్టి పట్టు పీతాంబారలతో అలంకరించి ఆశీనులు గావించి శ్రీ సుదర్శన హోమం జరిపించారు. రాత్రి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాల కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పుల్లయ్యస్వామి, ప్రతాప్‌స్వామి, స్థానిక అర్చకులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

నంద్యాల: పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సీరియస్‌గా తీసుకోవాలని, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై నోడల్ అధికారులతో జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్‌ఓ పుల్లయ్యతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ జరిగే పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత నోడల్ అధికారులు పూర్తిస్థాయి బాధ్యత తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 61 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు, 30 ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాలు, 3 స్థానిక సంస్థలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రితో పాటు అధికారులను చేరవేసేందుకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్‌డీఓలను ఆదేశించారు. సెక్టోరల్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రంలోని రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని సేకరించి కమాండ్ కంట్రోల్ రూంకు చేరవేయాలని చెప్పారు. ఓటర్లకు ఓటర్ స్లిప్ లు బుధవారం సాయంత్రంలోగా వంద శాతం పంపిణీ చేయాలన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ శామూన్

అహోబిల క్షేత్రం .. భక్తజన సంద్రం


దిగువ అహోబిలం మాడ వీధుల్లో భక్తుల సందడి


రథానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

ఆళ్లగడ్డ: అహోబిల బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామి వారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివస్తున్నారు. దీంతో నల్లమల గిరులు నారసింహుడి నామ స్మరణతో మారుమోగుతున్నాయి. మంగళవారం వివిధ రకాల సేవలు, పూజలను చూసి తరించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన శ్రీ ప్రహ్లాదవరదస్వామి రథోత్సవం మంగళవార రమణీయంగా సాగింది. అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీ రంగరాజ యతీంద్ర మహా దేశికన్ శాస్త్రోక్తంగా రథాంగ పూజలు నిర్వహించగా ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి సంప్రదాయంలో భాగంగా కొబ్బరికాయ కొట్టి ఉత్సవాన్ని ప్రారంభించగా, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రథం తాడు లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు.

ఎగువలో వైభవంగా ద్వాదశ పుష్ప యాగం..

ఎగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం ఉత్సవమూర్తులకు ఉత్సవం, తీర్థవారి చక్రస్నానం, సాయంత్రం ద్వాదశరాధనం, పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. అర్ధరాత్రి అనంతరం గరుడోత్సవ కార్యక్రమం జరిపించి శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం గావించారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు..

రాయలసీమ పల్లె సంస్కృతి సంప్రదాయాల్లో పశుసంపద ఓ భాగమని నేటి తరానికి వాటి విశిష్టత గురించి తెలిసేలా ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారని మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. అహోబిలం బ్రహ్మోత్సవాల సందర్భంగా కెడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బండలాగు పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు పోటీలను ప్రారంభించారు. గంగుల సుదర్శన్‌రెడ్డి, గంగుల భరత్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవ రెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సీపీ శ్రీనివాస రెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.


ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

మహిళలు రాణించాలి

శిరివెళ్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని యర్రగుంట్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం యర్రగుంట్ల డిగ్రీ, జూనియర్ కళాశాలలు, స్థానిక పొదుపు సంఘం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం పలు చట్టాలను రూపొందిస్తుందన్నారు. పొదుపు ఉద్యమంలో మహిళలు ముందజలో ఉన్నారని కొనియాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ మొయిద్దీన్, ఏపీఎం పుణ్యవతి, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్, మండల, గ్రామైక్య సంఘాల లీడర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పట్టణాన్ని తీర్చిదిద్దుతాం

నంద్యాల(సిటీ): పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పద్మావతినగర్‌లో మొక్కలు నాటేందుకు అనువుగా ఉన్న ప్రాంతాలను హార్టికల్చర్ అధికారి నాగరాజుతో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో వెలువడుతున్న కాలుష్య నివారణకు అనువైన మొక్కలు నాటుతామని, అలాగే పట్టణంలో ఉన్న 12 పార్కులను అభివృద్ధి చేశామని చెప్పారు. వినాయక ఘాట్ వద్ద ఉన్న పార్కును కూడా అభివృద్ధి చేస్తామని, పాదాచారుల కోసం ప్రత్యేక లైటింగ్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేసి తీర్చి దిద్దుతామని తెలిపారు. డీఈఈ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

నంద్యాల(అర్బన్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ శాసన మండలి అభ్యర్థి రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కోరారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయాలంటూ గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఓటర్లను అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో పేదల అభ్యున్నతికి సీఎం జగన్ మోహన్ రెడ్డి చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తే రాయలసీమ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందన్నారు. విద్యావంతులు ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తించాలని కోరారు.

దొర్నిపాడు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి, దొర్నిపాడు సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడులో గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పట్టబద్రులను అభ్యర్థించారు. సర్పంచ్ శివరామిరెడ్డి, ఉప సర్పంచ్ మహేష్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ భూమా శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ పల్లె శివశంకర్‌రెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, పల్లె ప్రసాద్‌రెడ్డి, ఇబ్రహీం, హుసేన్‌బాషా, గుర్రప్పయాదవ్, దస్తగిరి, గృహసారథి కిశోర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

ఓటు హక్కుపై కౌన్సిలర్లకు అవగాహన

నంద్యాల (సిటీ): ఈ నెల 13వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎన్నికల్లో పాటించాల్సిన నిబంధనలు తెలుసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా తెలిపా. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ తమ ఓటును ఎలా నమోదు చేయాలో ముందుగా తెలుసుకోవాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో ఓటు వేసేటప్పుడు చేయాల్సిన, చేయకూడని వాటిని వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు పాల్గొన్నారు.